

● గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా



# నీటి విడుదలపై.. నియంత్రణ ఏదీ?

నాగార్జున సాగర్ జలాశయంలోని నీటి వినియోగంపై నియంత్రణ కొరవడింది. ఇరు రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకుంటున్నాయి. 95 రోజుల్లో 122 టీఎంసీల నీటిని వాడేశారు. సాగర్ నీటి మట్టం 538 అడుగులకు పడిపోయింది. నవంబరు 12న పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండగా రోజురోజుకూ పడిపోతోంది. నీటిని పొదుపుగా వాడటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ సాగర్ నుంచి 20,998 కూసెక్కుల నీటిని వాడేస్తున్నారు. కుడి కాలువకు 10 వేల కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే స్థాయిలో తెలంగాణ కూడా నీటిని వినియోగించుకుంటున్నది. ఇరు రాష్ట్రాలు పోటీ పడి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తుండటం తో వేసవిలో పరిస్థితి ప్రమాదకరంలో పడవచ్చనే అభిప్రాయాన్ని జలవనరుల నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

- అవసరం లేని కాలువలకూ నీటి విడుదల
- వాగుల్లో పారుతున్న కృష్ణా జలాలు
- కుడి కాలువకు 10వేల క్యూసెక్కుల నీటి సరఫరా
- 538 అడుగులకు పడిపోయిన సాగర్ నీటి మట్టం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు దాదాపు పూర్తయింది. ఖరీఫ్‌కు సంబంధించి మిరప సాగు మాత్రమే ఉంది. మిరపకు మార్చి ఆఖరు వరకు నీటి సరఫరా అవసరం ఉందని అంచనా. పల్నాడు జిల్లాలో రబీలో వరి సాగు కూడా పెద్ద ఎత్తున చేశారు. ఈ రెండు పంటలకు నీటి అవసరం ప్రధానంగా మార్చి చివర వరకు ఉంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో రబీలో వేసిన మొక్కజొన్న, పొగాకు వంటి ఇతర పంటలు చివరి దశకు వచ్చాయి. వాటికి నీటి అవసరం లేదు. ఈ నేపథ్యంలో సాగర్‌లో ఉన్న నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉండగా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న వాదన రైతుల నుంచి కూడా వ్యక్తమవుతోంది. కుడి కాలువ పరిధిలో అన్ని మేజర్లు, మైనర్ల పరిధిలో సాగునీరు అవసరం లేదు. పంటలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి ఆ పరిధిలోనే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్‌లో అన్ని పంటలు వేసినప్పుడు ఎలా అయితే నీరు వదులుతారో, అదే విధంగా దాదాపు అన్ని కాలువలకు నీటి సరఫరా జరుగుతోంది. వరి నాట్లు కూడా పూర్తయ్యాయి. మిరపకు ఆరు తడులు సరిపోతాయి. వరికి కూడా వార బందీ అమలు చేసినా సాగునీరు సరిపోతుందనేది అంచనా. పంటలు సాగు చేసిన ప్రాంతాలకు మాత్రమే సాగు నీరు సరఫరా చేసే విధంగా జలవనరుల శాఖ ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు లేకున్నా సాగునీరు పొలాల్లో వృధాగా ప్రవహిస్తోంది. అలాగే వాగుల్లో కూడా నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నది. అవసరం ఉన్న కాలువలకు మాత్రమే నీటిని సరఫరా చేసేందుకు చర్యలు లేవు. కొన్ని కాలువలకు నీటి సరఫరాను నిలిపివేసేందుకు షట్టర్లు లేవని చెబుతున్నారు. దీని వలన అవసరం లేని ప్రాంతాలకు కూడా నీటి సరఫరా జరుగుతోంది.


### అధికారులు దృష్టి సారించాలి

ఏ కాలువ పరిధిలో ఏ ఏ పంటలు సాగులో ఉన్నాయి. ఏ మేరకు నీటి సరఫరా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేయాల్సి ఉంది. పంటలు లేని ప్రాంతంలోని కాలువకు నీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంది. వార బందీ అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. మిరప.. వరి సాగు ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం వలన నీటి వృధాను అరికట్టే అవకాశం ఉంది. ఈ మేరకు జలవనరుల శాఖ అధికారులు స్పందిస్తేనే వేసవి కూడా సాగర్‌లో నీటి నిల్వ ఉంటుంది. లేకుంటే తాగు నీటికి గడ్డు పరిస్థితులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది.

### సాగర్‌లో నీటి నిల్వ ఇలా..

నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు. సోమవారం 538.1 అడుగులు నమోదైంది. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 184.39 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్‌లోకి నీటి ప్రవాహం లేదు. జలాశయం నుంచి 20,998 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,000 కూసెక్కులు.. ఎడమ కాలువకు 8,718 కూసెక్కులు.. ఎస్ఎల్‌బీసీకి 2,000 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. పంటల అవసరాలను గుర్తించి నీటి సరఫరా చేయకుంటే, సాగర్‌లో ఉన్న నీటి నిల్వ నిండుకోవడం ఖాయం. ఉన్న నీటి నిల్వ 512 అడుగులకు తగ్గితే 136 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. అంటే ఈ స్థాయికి నీటి మట్టం చేరే వరకు ఇంకా 45 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా నీటి సరఫరాపై జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం కాకుంటే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. దీనిని ఇప్పటికైనా అధికారులు గుర్తించి మేల్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నాగార్జున సాగర్ జలాశయంలో పడిపోయిన నీటి నిల్వ





వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఇప్పటికీ గందరగోళంలోనే కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నెలకొన్న గందరగోళాన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, అది ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది.

# సచివాలయం.. గందరగోళం!

- హేతుబద్ధీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- మాతృ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్
- మల్టీ పర్పస్ ఫంక్షనరీస్ పేరుతో పని భారం
- స్పష్టమైన జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్
- మంత్రి డోలాకు విన్నవించిన సచివాలయ ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సృష్టించింది. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం అన్న పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ నిర్వహణ, పనివిధానానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా మొత్తంగా వ్యవస్థను గందరగోళం చేసింది. 2019లో కేవలం రెండు నెలల వ్యవధిలో లక్షా 30వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుని వారందరినీ గందరగోళంలో పడవేసింది. ఐదేళ్లపాటు వారిని పలు రకాల సేవల్లో వినియోగించుకున్న గత ప్రభుత్వం వారికి నిర్దిష్టమైన జాబ్ చార్టును కూడా రూపొందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులతో సంబంధం లేని పనుల్లో కూడా వాడుకుంటూ వారితో వెట్టి చాకిరీ చేయించుకుంది. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా సచివాలయాలను నడిపి పంచాయతీరాజ్ వ్యవస్థను నీరుగార్చింది. కనీసం వారికి డీడీవో అధికారాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. గతంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ అంశాలు మాతృశాఖ నుంచి జీతం మరొక శాఖ నుంచి పర్యవేక్షణ చేసిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఈ గందరగోళాన్ని తొలగించి, ఉద్యోగులను హేతబద్ధీకరించడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది.



### మిగులు ఉద్యోగులను ఏం చేయాలి?

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచి వాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యో గులు మిగులుతారు. ఇలా మిగిలిన ఉద్యోగులను ఏం చేస్తారనేది ఉద్యోగులను వెంటాడుతున్న ఆందోళన.

### మాతృ శాఖకు పంపాలంటూ వేడుకోళ్లు

రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో సచివాలయ ఉద్యోగులు తమ గోడును ఏకరువు పెట్టారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణలో చెబుతున్న మల్టీ పర్పస్ ఉద్యోగుల విధానాన్ని తొలగించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విధానంలో సొంత శాఖ విధులతో పాటు ఇతర శాఖల విధుల భారం కూడా ఉద్యోగులపై పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ ఉద్యోగులపై సచివాలయం పర్యవేక్షణ మాత్రమే ఉండాలని, మాతృశాఖ, సచివాలయం రెండింటి పర్యవేక్షణ ఉంటే అది గతంలో మాదిరిగా గందరగోళానికి దారి తీస్తుందని అంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్టును రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆరు గ్రేడులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను 3 గ్రేడులకు కుదించాలని గ్రేడ్- 1,2 జోనల్ పోస్టులను గ్రేడ్- 1గా, గ్రేడ్- 3,4,5లను గ్రేడ్- 2గా, గ్రేడ్-6ను గ్రేడ్-3గా మార్చాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం, పంచాయతీ డీడీవో, కన్వీనర్ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు హోదాకు తగినట్లుగా సీనియర్ అసిస్టెంట్ పే స్కేలు ఇవ్వాలని కోరారు.

హేతుబద్ధీకరణకు సంబంధించి గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అది ఇప్పటి వరకూ ఒక కొలిక్కి రాలేదు. ఉద్యోగుల హేతబద్ధమైన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయమైన పరిష్కారం కనుగొనలేకపోతే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది.

# ముంచుకొచ్చిన... మృత్యువు

వారంతా రెక్కాడితేగానీ.. డొక్కాడని మహిళా కూలీలు. పొద్దునే లేచి, చద్ది కూడు తిని పొలం పనులకు పోయి పొట్ట నింపుకునే వారు. రోజూలాగే ఆ రోజూ చకచకా ఇంటి పనులు ముగించుకొని పొలం పనులకు పయనమయ్యారు. కానీ వారికి తెలియదు వారెకుతుంది తిరిగిరాని లోకానికని. కూలీలందరూ ఓ ఆటోలో కిక్కిరిసి కూర్చున్నారు. వారికి తెలుసు అలా వెళ్లడం ప్రమాదకరమని, ఏదైనా జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిం దేనని.. పది రూపాయలు మిగులుతాయని ప్రమాదంపైనే ప్రయాణమయ్యారు. ఉదయాన్నే రోడ్డును పొగ మంచు కమ్మేసింది. 'ఇదిగో అబ్బాయ్ జాగ్రత్తగా నడుపూ..' అని అంటూనే ఉన్నారు. ఈలోపే దట్టమైన మంచును చీల్చుకొచ్చిన ఓ బస్సు వారి ఆటోను ఢీ కొట్టింది. ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు..

- ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ముగ్గురు మహిళా కూలీల మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు



ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు



మృతులు అల్లంశెట్టి అరుణ,తోట సీతారాములు, కుర్రా నాంచారమ్మ

# సమన్వయంతో పని చేయాలి

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆర్‌వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు సమ న్వయంతో విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ప్రిసై డింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవె న్యూ అధికారి ఖాజావలితో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రిసై డింగ్ అధికారులు ఎన్నికలు జరిగే ముందురోజు డిస్ట్రిబ్యూష న్ సెంటరు నుంచి పూర్తి స్థాయిలో పోలింగ్ సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటల సమయానికి ఓటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో జరుగుతున్న అన్ని విషయాలపై నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం స్పందిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రిసైడింగ్ అధికారి డైరీతో పాటు, ఇతర నాన్ స్టాట్యూటరీ, స్టాట్యూటరీ ఫారంలను సక్రమంగా పూర్తి చేసుకొని, బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీజ్ చేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి తిరిగి వాటిని రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు ప్రిసైడింగ్ అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందేలా పోస్ట్ ద్వారా గానీ, స్వయంగా గానీ అందించాలన్నారు. దరఖాస్తులు అం దించిన వారి చిరునామాకు పోస్టల్ బ్యాలెట్ మెటీరియల్ పోస్ట్ ద్వారా అందించటం జరుగుతుందని, ఓటు నమోదు చేసి పోస్టల్ బ్యాలెట్ కవర్లు మార్చి 2వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ పోలింగ్ పూర్తి అయిన తరువాత బ్యాలెట్ పేపర్ వినియోగానికి సంబంధించిన ఫారాలు, ఇతర ఫారాలు పూర్తి స్థాయిలో పోలింగ్ కేంద్రాల్లోనే పూర్తి చేసిన తరువాత మాత్రమే రిసెప్షన్ కేంద్రాలకు బయలుదేరి రావాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన విధంగా పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ ప్రిసైడింగ్ అధికారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులు, బ్యాలెట్ బాక్సులు ఓటింగ్‌కు సిద్ధం చేసే విధానం, సీల్ వేసే విధానంపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియో చిత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లుగా విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.

## గురజాలలో.. వైసీపీకి షాక్!

- టీడీపీలో చేరిన వైసీపీ చైర్మన్, కౌన్సిలర్లు
- వైస్ చైర్మన్‌గా భారతి ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పరిధిలోని పిడుగురాళ్లలో వైసీపీకి ఆ పార్టీ కౌన్సిలర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం 17 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈ నెల 3, 4 తేదీలలో వాయిదా పడటం, తిరిగి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొని (మిగతా 8వ పేజీలో)



ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు





## ఇంటింటా సౌర వెలుగులు..!

- పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి సౌర కాంతులు
- లబ్ధిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం

8

## తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం

- కోటప్పకొండలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు పుల్లారావు, అరవిందబాబు

8

## చికెన్ @ 100

కొనుగోళ్లపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

# ముంచుకొచ్చిన మృత్యువు




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో, మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



ప్రమాదంలో మృతి చెందిన కూలీల మృతదేహాలు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఫిబ్రవరి 17: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో జీబీసీ రహదారిపై గుంటూరు వెళుతున్న మహిళ కూలీల ఆటోను గుంటూరు వైపు నుంచి నారాకోడూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళ కూలీలు అక్కడిక్కడే మృతి చెందగా ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన మహిళ వ్యవసాయా కూలీలు ప్రతిరోజూ రాజధాని ప్రాంతంలోని నీరుకుండ గ్రామంలో మినుము పీకుడు పనులకు వెళుతున్నారు. రోజులాగేనే సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పొగమంచు రోడ్డును కమ్మేసింది. ఆటో నారాకోడూరు గ్రామం దాటి గుంటూరు వైపు వస్తోంది. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి తెనాలి వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేశాడు. ఆ సమయంలో పొగమంచు ఉండటం కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను బస్సు డ్రైవరు గమనించలేదు. దీంతో ఆటోను వేగంగా ఢీ కొట్టాడు. ఆటో ఉన్న కూలీలందరూ రోడ్డుపైనా, రోడ్డు పక్కనా చెల్లాచెదురుగా ఎగిరి పడ్డారు. ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కూలీలు అల్లంశెట్టి అరుణ(39), తోట సీతారాములు (41), కుర్రా నాంచారమ్మ (40)లు ఘటన స్థలంలోనే మృతి చెందారు. అదే సమయంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, పలువురు రైతులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. గాయాలపాలై రక్తమోడుతున్న మహిళ కూలీలను స్థానికులే రహదారిపై నుంచి పక్కకు చేర్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ వెంకట కృష్ణ గాయపడిన మహిళ కూలీలను 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతి చెందిన మహిళల మృతదేహాలను స్థానికుల సహాయంలో పంచానామా నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి పంపించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్‌లో ఎం శివమ్మ, ఎం శివపార్వతి, ఏ వెంకట రమణ, కే రత్నకుమారి, జీ మల్లేశ్వరి, కే ఆదిలక్ష్మి, ఆర్ సుబ్బమ్మ, ఏ కృష్ణకుమారి చికిత్స పొందుతున్నారు. మహిళ కూలీల మృత్యువాత పడిన సంఘటన గురించి తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతులకు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ పలువురు విచారం వ్యక్తంచేశారు.

**సుద్దపల్లిలో విషాద ఛాయలు ..**

సుద్దపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాద ఛాయలు నింపింది. ఒకే ప్రాంతానికి చెందిన మహిళలు ప్రతి రోజు దూరప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాలను పోషిస్తున్నారు. అందరితో చేదోడువాదోడుగా ఉంటున్న మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పాటు 8 మంది మహిళలు గాయాలు పాలై ఆసుపత్రిలో చేరడంతో గ్రామస్థులు దుఃఖంలో మునిగిపోయారు.

## బుడంపాడు ప్రమాదంపై పెమ్మసాని విచారం

- మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని భరోసా..
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు
- అధికారిక చర్యల నిమిత్తం కలెక్టర్‌కు సూచనలు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నారాకోడూరు రహదారిపై బుడంపాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు మహిళా కూలీలు మృతి చెందడం పట్ల గ్రామీణాభివృద్ధిశాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విచారం వ్యక్తం చేశారు. భోపాల్ పర్యటనలో ఉన్న ఆయన దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే స్పందించిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందజేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణను ఫోన్‌లో ఆదేశించారు. మృతి చెందిన ముగ్గురు వ్యవసాయ కూలీల కుటుంబాలతో పాటుగా క్షతగాత్రులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఆ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. అలాగే ప్రమాదం జరగడానికి గల కారణాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతులు అరుణ, సీతారాములు, నాంచారమ్మలకు తన సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన ఆటోలో పది మంది ప్రయాణిస్తున్నారని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రజలను తీసుకెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకోకుండా రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని అధికారులకు మంత్రి పెమ్మసాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా ఉంటాం ..

**- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్**

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బుడంపాడు-నారాకోడూరు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా కలిచి వేసిందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆయన క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీకి, అలాగే మృతదేహాలకు పంచనామా త్వరితగతిన పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఈ ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ









కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్, చిత్రంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

## డాక్టర్ లలిత్ సాగర్‌కు టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు

- అందజేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

నరసరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టాప్5 కిడ్నీ సర్జన్‌గా నిలిచిన నరసరావుపేటకు చెందిన డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా అందజేసే 'టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు'కు ఎంపికయ్యాడు. ఈ మేరకు విశాఖపట్టణంలో జరిగిన 'టైమ్స్' మెగా కార్యక్రమంలో డాక్టర్ లలిత్ సాగర్ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు వైద్య ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకోవడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం హయాంలోనే వైద్యులకు తగిన ప్రోత్సాహం కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. అత్యంత ఖరీదైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలనే తన లక్ష్యానికి సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లే స్ఫూర్తి అని అన్నారు. ఐకానిక్ లీడర్ హెల్త్ కేర్ పేరిట అత్యుత్తమ వైద్య సేవలందించిన వైద్యులకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా ప్రతిభావంతులను ఎంపికచేసి ఈఅవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్- 2025ను కిడ్నీ (యూరాలజీ) సర్జన్ డాక్టర్ కడియాల లలిత్‌కు దక్కింది. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సతీమణి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, వారి కుమారులు కడియాల అక్షయ్‌నంద, అభయ్‌వర్ధన్ పాల్గొన్నారు.

## అంబటి సోదరులకు కార్పొరేషన్ అధికారులు దాసోహం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని, అనుమతులు రద్దుచేసి ఆయా యాజమాన్యానికి కార్పొరేషన్ అధికారులు ఉత్తర్వులు జారీచేసినప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా బహిరంగంగా గృహ ప్రవేశాలు చేయిస్తున్న గ్రీన్ గ్రేస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏంటని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్యానికి దాసోహమయ్యారని ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల విలేకరులతో మాట్లాడుతూ అంబటి మురళికి కార్పొరేషన్ అధికారులు ఎందుకు వంత పాడుతున్నారో చెప్పాలన్నారు. ఉన్నతస్థాయి కమిటీ వేసినప్పటికీ అక్రమ కట్టడాలపై ఏ చర్యలు తీసుకోకపోవడంపై అంతర్యం ఏమిటి కమిషనర్‌ను ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్య అక్రమాలు, అవకతవకలను తాను నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ సిబ్బంది చూసిచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియటం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

## విద్యుత్ తీగ తగిలి కార్మికుడి మృతి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెనాలి పట్టణంలోని రజకపేటలో జరిగింది. కొల్లిపరకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కేశన గోపి (34) రజకపేటలోని ఓ అపార్టుమెంట్ వద్ద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 3 అంతస్తుల భవనం వెలుపల వైపున పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలను గోపి తాకాడు. దీంతో షాక్‌కు గురై కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2వ పట్టణ ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం సోమవారం నాటికి 537.70 అడుగులు ఉంది. ఇది 183.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,078, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో 37,076 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

## ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థ' నాటిక

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి). మూడు రోజుల పాటు నిర్వహించిన రంగస్థలి 24వ జాతీయ ఆహ్వాన తెలుగు నాటిక పోటీలలో ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి చిగురు మేఘం నాటిక నిలిచింది. ఉత్తమ నటుడిగా అన్నదాత నాటికలో అంకమ్మతాత పాత్రధారి చెంచు పున్నయ్య, ఉత్తమ నటిగా తితిక్ష నాటికలో భారతి పాత్రధారి ఎస్. జ్యోతిరాణి ఎంపికయ్యారు. ఉత్తమ రచన తితిక్ష , ఉత్తమ క్యారెక్టర్ నటుడు కావూరి సత్యనారాయణ (చిగురుమేఘంలో చిన్నయ పాత్రధారి ) ఉత్తమ హాస్య నటుడు శేషయ్య ( పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రధారి) ఉత్తమ విలన్ పవన్ కళ్యాణ్ (రాత నాటికలో అజయ్ పాత్రధారి) ఉత్తమ దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి (ఇంద్రప్రస్థం) ఉత్తమ మేకప్ ఉమా (తితిక్ష నాటిక ), ఉత్తమ రంగాలంకరణ టి.బాబురావు (తితిక్ష నాటిక ), ఉత్తమ సంగీతం కెవి.రమణ (పక్కింటి మొగుడు ), ఉత్తమ బాల నటి సురభి వాగ్దేవి (రాత నాటిక) ఎంపికయ్యారు. ఉత్తమ జ్యూరీ బహుమతిని వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ 'రాత' నాటిక దక్కించుకుంది. న్యాయ నిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, షేక్ బాజీ మస్తాన్‌లు వ్యవహరించారు.



ఉత్తమ నటుడికి మెమెంటోను అందజేస్తున్న వెంకట్ నల్లపాటి

## విద్యుదాఘాతంతో బీహార్ కార్మికుడి మృతి



పవన్ మృతదేహం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై బీహార్ కార్మికుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని కారంపూడి రోడ్డు వద్ద ఐటీసీ కార్యాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బెసాలి జిల్లా బిల్సర్ హాట్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ అపార్ట్‌మెంట్‌లో టైల్స్ పనులు చేసేందుకు తోటి స్నేహితులతో కలిసి నెల రోజుల క్రితం వినుకొండకు వచ్చారు. సోమవారం అపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా పక్కను ఉన్న విద్యుత్ వైర్ తగిలి షాక్‌కి గురై అపస్మారకంగా పడిపోయాడు. గమనించిన తోటి మిత్రులు హుటాహుటిన ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే పవన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పవన్ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య వినీత నిండు గర్భిణిగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 101,109,120 |
| చికెన్ విత్ స్కిన్ | 194.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 204.00 |



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

## ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం

- ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం అవుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. సోమవారం వర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫుడ్ సైన్స్ డైటెటిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదురుగావున్న ఉజ్వలహోంలో 'ఒత్తిడి ఉపశమనంపై పౌష్టిక ఆహార ప్రభావం' అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.భవిత అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ యువత ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు సిస్టర్ రోజ్‌లీనా సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మందూరు వెంకటరమణ, డాక్టర్ డి. జలజకుమారి, కౌన్సిలర్ ఎం. రూప, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆచార్య వెంకటేశ్వర్లు

## అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

పెదకాకాని, ఫిబ్రవరి 17( ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఆచార్య ఎ.ప్రమీలరాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రమీలారాణి మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్. పాల్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, అందులో వర్సిటీ వ్యాయామవిద్య కళాశాల, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, ఏబీఆర్ డిగ్రీ కళాశాల, కందుకూరులోని శ్రీగుప్తా డిగ్రీ కళాశాలల జట్లు లీగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. పోటీలకు నిర్వాహక కార్యదర్శిగా బి.అప్పలరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.బుచ్చిబాబు, వై.వేళాంగిణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య మధు మూర్తి

## వినూత్న ఆలోచనే నూతన ఆవిష్కరణలకు పునాది

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి
- ఆర్వీఆర్‌జేసీలో ప్రారంభమైన ఐడీఈ బూట్ క్యాంపు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు పునాది అని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. గుంటూరు రూరల్ మండలం, చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త సహకారంతో, వాధ్వాని ఫౌండేషన్ నేతృత్వంలో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్. కె.మధుమూర్తి మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అన్నిరంగాల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నదన్నారు. ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలే పెట్టుబడులుగా మారి, నూతన స్టార్టప్‌లకు బీజం వేయాలని ఆకాంక్షించారు. అవేరా ఏ.ఐ మొబిలిటీ ఫౌండర్, సీఈవో డాక్టర్ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా స్టార్టప్‌లను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఏఐసీటీఈ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజనాగ భీమలింగేశ్వర్‌రెడ్డి, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుప్రభా ఆర్ డాక్టర్. ద్రిష్త డేజోయార్డర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న విద్యాసాగర్

## విజ్ఞాన్స్‌లో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి):చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ అటానమస్ సిస్టమ్స్)ను ప్రారంభించామని వర్సిటీ వైస్‌ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీల సంయుక్త ఆర్థిక సౌజన్యంతో ఈ డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డీ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ సెంటర్ వలన విద్యార్థులకు డ్రోన్ డిజైన్, వినియోగం, ప్రోగ్రామింగ్‌పై శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

## 1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 9000 | 13600 | 334 | -- | -- |
| నంబరు. 5 | 11000 | 14300 | నంబరు. 5 | -- | -- |
| 273 | 10000 | 12300 | 273 | -- | -- |
| 341 | 10000 | 14000 | 341 | -- | -- |
| 4884 | 10000 | 12800 | 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- | సూపర్ 10 | -- | -- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 11000 | 14000 | తేజ | -- | -- |
| బ్యాడిగి | 10000 | 13500 | బ్యాడిగి | -- | -- |
| దేవనూరు డీలక్స్ | 10000 | 13000 | దేవనూరు డీలక్స్ | -- | -- |
| తాలుకాయలు | 4500 | 7000 | ఏసీ తాలుకాయలు | -- | -- |

## రేపు పట్టభద్రులతో సమావేశం

కొల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్ట భద్రులతో బుధవారం సమావేశం నిర్వహించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఉదయం 9.30 గంటలకు పట్టభద్రుల సమావేశానికి మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తక్ అహ్మద్, ఎన్నికల పరిశీలకుడు వంగా సాంబిరెడ్డిలతో పాటు స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరవుతారన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మైనేని కోరారు.

## క్షత్రియ భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలి

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపాలిటి పరిధిలో బీసీ అగ్నికుల క్షత్రియ భవనం నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని సోమవారం బీసీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాధపల్లి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఫ్రెషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పీత మోహనరావు, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ చంద్రబాబు, కృష్ణంరాజు, కె.బాలచంద్రరావు, అగ్నికుల క్షత్రియ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్కూల్ విలీనాన్ని తిరస్కరిస్తూ కలెక్టర్‌కు వినతి

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మండేవారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో 3, 4, 5వ తరగతుల విలీనం తిరస్కరిస్తూ సోమవారం గ్రామస్థులు కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ విలీనం చేసేందుకు నిర్ణయించిన పాఠశాలలో ఎటువంటి సౌకర్యాలు లేవని, తమ ఊరిలోనే పిల్లలకు విద్యాభ్యాసం లభించే విధంగా చూడాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారామ మందిర వార్షికోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సీతారామ మందిర ప్రథమ వార్షికోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. సోమవారం అద్దేపల్లి కాపు సంఘం ఆధ్వర్యంలో సీతారామ మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దీవి నాగశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ, సీతారామచంద్రుల దాంపత్యం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుంటే సుఖసంతోషాలతో ఉంటారన్నారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు.

## గ్రామ దేవతలకు సారె సమర్పణ

కొల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతలకు పార్వతీ అమ్మవారి దేవస్థానం భక్త బృందం సారె సమర్పించారు. కొల్లూరులో ఉన్న గ్రామ దేవతలు, చింతలమ్మ అంకమ్మ తల్లి జయంతి పురస్కరించుకుని పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహిళా భక్తులు చీరసారెతో ఊరేగింపుగా దేవస్థానం నుంచి బయలుదేరి దక్షిణపు వీధిలో ఉన్న అమ్మవార్ల ఆలయానికి వెళ్లి సమర్పించారు.

## గుండెపోటుతో కార్మికుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భట్టిప్రోలులో కొన్ని రోజులుగా సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. నిర్మాణ పనులకు కృష్ణా జిల్లా నాగాయలంక మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన మాతంగి శ్రీనివాసరావు వచ్చి పని ప్రదేశంలో గుండెపోటుతో మృతి చెందినట్లు సాటి కూలీలు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోనేటిపురం గ్రామానికి చెందిన ముదాల పాములు (70) తన స్కూటీపై సొంత పనుల నిమిత్తం భట్టిప్రోలు వస్తుండగా హైవే దాటిన అనంతరం వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య అలివేలు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుండ్రెడ్డి శ్రీహరి మృతి తీరనిలోటు

కర్లపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామానికి చెందిన గుండ్రెడ్డి శ్రీహరి వృద్ధాశ్రమం స్థాపనలో విశేష కృషి చేశారని, వారి మృతి వృద్ధాశ్రమానికి తీరనిలోటు అని గుండ్రెడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలోని వృద్ధాశ్రమంలో గుండ్రెడ్డి శ్రీహరి చిత్రపటానికి పూలమాలలు వేసి వృద్ధాశ్రమ సభ్యులు, నిర్వాహకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల ప్రసాద్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, లక్కాకుల వెంకట్రావు, ఇక్కుర్తి లక్ష్మీ నరసింహ, దామర్ల సూర్యనారాయణ, తిరుపతిరావు, సూరలక్ష్మీనారాయణ, ఇక్కుర్తి పిచ్చయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

## కరాటేలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చెరుకుపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, చెరుకుపల్లి విద్యార్థులు రాష్ట్ర కరాటే ఛాంపియన్ షిప్ 2025లో ప్రతిభ కనబరిచారు. విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్‌స్టేడియంలో జరిగిన పోటీలలో కె.మొహిత్, ఎం.అరవింద్, ఎం.సాత్విక్, ఎం.రోషన్, ఎ.గౌతమ్, షైజై దీపీ, డి.రేవంత్, ఎస్.మోక్షఙ్ఞ, జీ.చక్రధర్, పి.మోహన్‌గౌతమ్, ఎం.లోకేష్‌లను చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి అభినందించారు.



భీమావారిపాలెంలో ఇంటింటికెళ్లి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

# ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సోమవారం బాపట్లలోని భీమావారిపాలెంలో ఇంటింటికెళ్ళి కరపత్రాలను అందజేసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రూపానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు బొంతు శివసాంబిరెడ్డి, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇది స్నేహపూర్వక ప్రభుత్వం : ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మనది స్నేహపూర్వక ప్రభుత్వం.. మాకు మీరు, మీకు మేము తోడుగా ఉండి అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చుండూరు, వేటపాలెం, యడ్లపల్లిలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జగన్ అనుభవరాహిత్యంతో చిందరవందర చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నారని అన్నారు. కూటమి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అఖండ మెజారిటీకి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ, నిరుద్యోగుల ఆశయాలు తీర్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి ముస్తక్ అహ్మద్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో రాష్ట్ర పాలన దోపిడీదారుల చేతుల్లో ఉండటం వలనే అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. ఓటర్లు ఇది గుర్తించి కూటమి అభ్యర్థి ఆలపాటికి విజయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, యల్లారెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, గుదేటి బాలకోటిరెడ్డి, ముక్కామల వేణు, వసంతరావు, జాన్‌సైదా, రాయపాటి శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, భీమవరపు శ్రీమాన్, దేవరపల్లి అనీల్, ఆళ్ల వెంకటసుబ్బారెడ్డి, శరత్‌చంద్ర, దేవిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కట్టవాదలో నక్కల వెంకటస్వామి కూటమి పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

● బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా కృషి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ పార్టీశ్రేణులకు సూచనలు చేశారు. సోమవారం సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఉన్న పట్టభద్రుల జాబితాలవారీగా విభజించి ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, నాయకులు బాబునాగేంద్ర, వల్లూరి భావన్నారాయణ, అడపాల శ్రీరామయ్య, ముప్పల శ్రీనివాసులు, కామరాజు గడ్డ శ్రీనివాస్, నటరాజన్, బాలసుబ్రహ్మణ్యం, తురగా గోపి పాల్గొన్నారు.

● కొల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను టీడీపీ శ్రేణులు సందర్శించి ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కరపత్రాలు అందించి కూటమి అభ్యర్థి ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే గ్రామంలో ఇంటింటికి తిరిగి పట్టభద్రుల ఓటర్లను కలిసి ఆలపాటికి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు సుంకర శ్రీను, నర్రా మధు, బోయపాటి తేజ, యడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో బ్యాచ్‌లర్ ఆఫ్ టెక్నాలజి స్ట్రీమ్ సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఎఐఎంఎల్ నాలుగు, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం మూడు రోజులపాటు పవర్ బిఐ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముప్పలనేని శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల ఉద్యోగావకాశాలు కోసం ఎన్ని వర్క్‌షాపులైనా నిర్వహించటానికి వెనుకాడనన్నారు. సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ చాలా కంపెనీలు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవటానికి పవర్ బిఐ విస్తృతంగా ఉపయోగిస్తున్నాయన్నారు. జాయింట్ సెక్రటరి డి.వెంకయ్యచౌదరి మాట్లాడుతూ దేహానికి డాక్టర్ ఎంత అవసరమో దేశానికి ఇంజనీరింగ్ అంతవసరమని తెలిపారు. ప్రిన్సిపాల్ షేక్ నజీర్ మాట్లాడుతూ వర్క్‌షాపులు మరిన్ని నిర్వహించాల్సిందిగా సైబర్ సెక్యూరిటి డేటా సైన్స్ ఎఐఎంఎల్ విభాగాధిపతులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

## చెత్త నుంచి సంపద తయారీ కోసం కృషి చేయాలి : డీపీవో

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ప్రతి కుటుంబం నుంచి తడి, పొడి చెత్తని వేర్వేరుగా సేకరించి వర్మి కంపోస్ట్, డ్రై వెస్టు అమ్మకాల ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకరరావు అన్నారు. బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల పంచాయతీలోని నందిరాజుతోటలో గల ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్లపైన, బహిరంగప్రదేశాలలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచటం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎల్‌పీవో కుమారస్వామి, ఈవోపీఆర్డీ బనంహూడి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములుపాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పారిశుధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో సోమవారం తెల్లవారుజాము నుండే కమిషనర్ జి.రఘునాథరెడ్డి పర్యటించారు. కర్లపాలెం రోడ్డులోని బాపట్ల పబ్లిక్ స్కూల్ వద్ద, చీలురోడ్డు వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని తనిఖీ చేసి వారితో నేరుగా మాట్లాడి పలు సూచనలు చేశారు. చీలురోడ్డు వద్దగల పైపులైన్ లీకేజిని తనిఖీ చేసి త్వరితగతిన బాగు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సూర్యలంకరోడ్డు ప్రధాన వీధుల పారిశుధ్య పనితీరును శానిటరి ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. విజయలక్ష్మీపురంలో తాగునీటి సరఫరా గురించి ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం సూర్యలంకరోడ్డులో గల అన్నక్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి రుచి, ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

## 150 గోవా మద్యం బాటిళ్ళు సీజ్

బాపట్లరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు సిబ్బందితో కలిసి ఉమ్మడిగా సోమవారం బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో దాడులను నిర్వహించారు. ఈ దాడులలో వల్లభ ఝాన్సీ అనే మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 150 గోవా మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని సీజ్ చేయటంతోపాటు ఆమెపై కేసు నమోదు చేయటం జరిగిందని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.గీతిక తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రభుదాసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.రామారావు, ఆర్.నరహరిరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## అప్కాస్‌ను కొనసాగించాలి : ఫెడరేషన్ సభ్యులు

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్కాస్‌ను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలనే ఆలోచనను రాష్ట్రప్రభుత్వం విరమించుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం కలెక్టరేట్ ఎదుట తమ డిమాండ్లను విలేకర్లకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలు, సంస్థలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వ పథకాలలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రతి ఆరునెలలకు కరువు భత్యం చెల్లించాలని, సిక్‌లీవ్‌లు అమలు చేయాలని కోరారు. రిటైర్డ్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని తదితర సమస్యలు వివరించారు.

## అతివలకు అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్



సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అతివలకు అండగా సఖివన్‌స్టాప్ సెంటర్ ఉంటుందని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. బాపట్లలోని ఉప్పరపాలెం గేటు సమీపంలో ఉన్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింస, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, వివాహేతర సంబంధాలు, ఈవ్ టీజింగ్, బెదిరింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్‌సైట్‌ల ద్వారా జరిపే నేరాలు, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చేయవచ్చునని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సఖి కేంద్రంలో సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్ కౌన్సెలింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. మహిళలు ఒంటరిగా ఉండి ఆశ్రయం కావాల్సి వస్తే టోల్‌ఫ్రీనెంబరు 181కు కాల్ చేసి సంప్రదిస్తే తక్షణం సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పిస్తారన్నారు. సహాయం కొరకు వచ్చిన బాధిత మహిళలు ఉండేందుకు ఏర్పాటు చేసిన గదులు, వంటగది, కౌన్సెలింగ్ రూమ్, మెడికల్ చెకప్‌రూమ్, స్టాఫ్ రూమ్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీమంతాలు



గర్భిణులకు తాంబూలాన్ని అందజేస్తున్న ఆర్డీవో గ్లోరియా తదితరులు

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా నిర్వహించిన సామూహిక సీమంత మహోత్సవానికి ఆర్డీవో పి.గ్లోరియా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గర్భిణులకు బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమాతో కలిసి తాంబూలాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ సామాజిక సేవారంగంలో విస్తృతంగా నూతన చైతన్యం నింపుతున్న బాపట్లరెడ్‌క్రాస్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ వర్గాలకు, కులాలకు అతీతంగా సీమంత కార్యక్రమాలను రెడ్‌క్రాస్ ఎంతో అంకితభావనతో చేపడుతోందన్నారు. కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సేవాభావన రెడ్‌క్రాస్ నుంచి నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఐసీడీఎస్ అధికారి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తల్లిబిడ్డల సంక్షేమం దృష్ట్యా మంచి ఆహారం, నిద్రతోపాటు ఆనందకర వాతావరణానికి సీమంత కార్యక్రమాలు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ రాయుడు కొలను మోహన్, డీవీ రమణారావు, గుంటూరు రామసుబ్బారావు, టి.శ్రీనివాసరావు, గోపీకృష్ణ, నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

## కేఎస్ లక్ష్మణరావు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



పట్టభద్రులకు కరపత్రాలను అందజేస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును గెలిపించటం ద్వారా శాసన మండలిలో సమర్థతకు పెద్దపీట వేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్.లక్ష్మణరావు తరుపున బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో సీఐటీయూ జిల్లా నాయకులతో కలిసి ఆమె ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో ప్రజా సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి బలమైన ప్రజాతంత్ర ఉద్యమకర్తగా ఉన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును తిరిగి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య, సీఐటీయూ సీనియర్ నాయకుడు నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● రేపల్లె, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా సీపీఎం నేతలు సోమవారం చెరుకుపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. పట్టభద్రులందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకి వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, టి.కృష్ణ పాల్గొన్నారు.

## జిల్లెళ్ళమూడిలో ఎమ్మెల్యే వేగేశన ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల,ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి మాత శ్రీ అనుసూయ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో నాన్నగారి ఆరాధన కార్యక్రమాలు ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా జరిగాయి. సోమవారం దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి అన్నప్రసాదాన్ని ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రూపానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివస్వామిరెడ్డి పాల్గొన్నారు.



## చేనేత కుటుంబాలు ఆర్థికంగా ఎదగటానికి కృషి చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చేనేత కుటుంబాల జీవన స్థితిగతులను మెరుగుపర్చుటకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధితాకాధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముద్ర పథకం కింద చేనేత కుటుంబాలకు చేయూతనందించేందుకు 1,044 మందికి రుణాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 76 మందికి మాత్రమే ఆయా బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందాయని, 245 మందికి రుణాలు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో 7794 చేనేత కుటుంబాలు ఉండగా అందులో 7217 కుటుంబాలు యాక్టివ్‌గాను, 581 కుటుంబాలు ఇనాక్టివ్‌గా ఉన్నాయని సర్వే నివేదిక ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కుటుంబాలు 18 బ్యాంక్‌ల పరిధిలోకి వస్తాయని కలెక్టర్‌కు ఎల్‌డీఎం వివరించారు. 18 బ్యాంక్‌లకు సంబంధించిన మేనేజర్లకు, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్‌డైరెక్టర్‌కు, చేనేతజౌళీ సహాయ సంచాలకులకు సర్వేరిపోర్ట్‌ను అందజేయాలని డీఎల్‌డివో అధికారులను ఆయన ఆదేశించారు. సర్వేనివేదిక ప్రకారం బ్యాంక్ అధికారులు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు మంజూరులో ఆయా చేనేత కుటుంబాలను తనిఖీ చేసినప్పుడు అక్కడ మగ్గాలు లేవని కలెక్టర్‌కు ఎల్‌డీఎం వివరించారు. రుణాలు మంజూరు చేయటకు మార్జిన్ నగదు రూ.25 వేలు ముందుగా కట్టాలని, కడితేగాని రుణాలు మంజూరు చేయటంలేదని సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నందున రుణాలివ్వటం లేదని చేనేత జౌళీ శాఖ సహాయ సంచాలకులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో చీరాల, వేటపాలెం, భట్టిప్రోలు, చెరుకూరు, రేపల్లె, మార్టూరు మండలాలలో నేతకార్మికుల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని సర్వే రిపోర్ట్ తెలుపుతుందని కలెక్టర్ తెలిపారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉండి రుణాలు మంజూరు కాని కుటుంబాలను గుర్తించి వారికి శ్రీనిధి కింద రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో చేనేత జౌళీ శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్‌డీఎం ఎం.శివకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ పద్మ, బాపట్ల డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి, చీరాల డీఎల్‌డీవో పద్మావతి పాల్గొన్నారు.

## మహాశివరాత్రిని విజయవంతం చేద్దాం : తహసీల్దార్



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు

రేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న మహాశివరాత్రిని సమష్టి కృషితో విజయవంతం చేద్దామని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో అన్నిశాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకోసం ఆలయం చుట్టూ చలువపందిళ్ళు, దర్శనార్థం క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసులు పటిష్ట బందోబస్తును నిర్వహించాలని సూచించారు. ఎక్సైజ్ అధికారులు చుట్టు ప్రక్కల ఎక్కడా మద్యం అమ్మకుండా చూడాలన్నారు. తాగునీటి సౌకర్యం, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల కోసం మెడికల్‌క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. భక్తుల కోసం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకల రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శోభారాణి, దేవాదాయ శాఖ ఈవోలు దివి అప్పలాచార్యులు, మేకా సాంబశివరావు, ఎస్‌ఐ రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, కొమ్మూరి సత్యం, బొందలపాటి మల్లికార్జునరావు, వేపూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోలకు ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులు అందజేత

వేమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులను ఎన్నికల అధికారి సుశీల సోమవారం బీఎల్‌వోలకు అందజేశారు. బుధవారం సాయంత్రం లోగా సంబంధిత ఓటర్లకు స్లిప్పులను అందజేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 843 మంది, మరో 820 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

## విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

కొల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ప్రయోజనాలు పొందాలంటే రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వాగోలు బుష్ అన్నారు. కొల్లూరులోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం రైతులకు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే భవిష్యత్‌లో పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు పొందవచ్చన్నారు.

## అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

రేపల్లె, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు వేతనాలను పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. అంగన్‌వాడీ వేతనాలు పెంచాలంటూ రేపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సీడీపీవో సుచిత్రకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.కృష్ణకుమారి, కె.రత్నకుమారి, నిర్మలాజ్యోతి, డి.జ్యోతి, రాజ్యలక్ష్మీ, సీఐటియూ నాయకులు కేవీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా.. సౌర వెలుగులు!



కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి విద్యుత్ రంగంలో సంస్కరణలపై పెద్దఎత్తున దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇంటికప్పుపై సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను ముమ్మరం చేసింది. దశల వారీగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఉన్న అన్ని ఇళ్లకు సౌర కాంతులు అందేటట్లు ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం ముందుకెళుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం దన్నుగా దీనిని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఉచితంగా అందివ్వడానికి మార్గదర్శకాలను ప్రభుత్వం గతంలోనే విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ వివరాలను సేకరించిన యంత్రాంగం ఆ జాబితాను ప్రభుత్వానికి పంపింది. మిగిలిన వారికి రాయితీపై ఈ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవడంతో పాటు లబ్ధిదారులకు సౌరవిద్యుత్ ఫలాలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం అడుగు లేస్తోంది

● పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాఫ్‌ల ఏర్పాటు

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ సౌర కాంతులు

● లబ్ధిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం ● ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా యూనిట్లు ● తొలి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5 లక్షల కుటుంబాలకు లబ్ధి ● ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సౌర విద్యుత్‌కే మొగ్గు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు యూనిట్‌కు అయ్యే వ్యయంతో పాటు దాని ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్ ఎలా పొందవచ్చో అనే దానిపై ఇప్పటికే పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించడంతో దరఖాస్తులు భారీగానే వచ్చాయి. వాటి ఆధారంగా లబ్ధిదారుల జాబితాను తయారు చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమయింది. పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే 2 కిలో వాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ యూనిట్ వ్యయం రూ.1.80 లక్షలుగా ఉంది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రాయితీ రూపంలో భరించ నున్నాయి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం భరించేది 40 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పై కప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అయ్యే ఖర్చులో 40 నుంచి 60 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీలు అందిస్తున్నాయి

### రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా....

సోలార్ రూఫ్‌టాప్‌లను పీఎం సూర్యఘర్ పథకం కింద అమర్చుకోవడానికి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను గతంలోనే ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. వీటి ఆధారంగా సంబంధిత సర్వీస్ కనెక్షన్ నెంబరు, మొబైల్ నంబరు యాప్‌లో నమోదు చేయగానే వినియోగదారుడికి వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది

### చార్జీల భారం తగ్గించడమే లక్ష్యంగా...

ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ విభాగాన్ని తిరోగమన బాట పట్టించడమే కాకుండా వినియోగదారులను కరెంటు చార్జీల రూపంలోఎడాపెడా బాదేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సోలార్ విద్యుత్‌ను అత్యంత ప్రాధా న్యంగా తీసుకుని అడుగులేస్తుండడం, అందుకు సంబంధించిన కార్యాచరణ కూడా పీఎం సూర్య ఘర్ పథకం రూపంలో వేగం అందుకోవడంతో త్వరలోనే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చాలా ఇళ్లు సౌర కాంతులు వెదజల్లనున్నాయి

### వినియోగాన్ని బట్టి....

ఇళ్లల్లో వాడే విద్యుత్ వినియోగం ఆధారంగానే ఎంత కిలోవాట్‌ల రూఫ్‌టాప్‌లు అవసరం అవుతాయనే విషయంలో లబ్ధిదారులు అంచనాకు రావాల్సి ఉంది. నెలకు ప్రస్తుతం 150 యూనిట్లకు దిగువనే కరెంటు వాడేవారు ఒక కిలో వాట్, 150 నుంచి 300 యూనిట్ల మధ్యలో వారైతే రెండు కిలోవాట్స్, 300 యూనిట్ల కంటే అదనంగా వినియోగించే వారు మూడు కిలోవాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో దాదాపు 5 లక్షల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా దాదాపు 65 శాతం మంది వినియోగదారులు రెండు కిలోవాట్స్ కేటగిరీలోనే ఉండడం గమనార్హం.

### ప్రభుత్వ కార్యాలయాల్లోనూ...

గత ప్రభుత్వ నిర్వాకంతో వివిధ ఆఫీసులకు సంబంధించి లక్షల్లో కరెంటు బిల్లులు పేరుకుపోయాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలే దాదాపు రూ.2.50 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువగా రెవెన్యూ విభాగానివే ఉండడం గమనార్హం. ఇక గ్రామ పంచాయతీల పరిధిలో బకాయిలు ఉన్న కరెంటు బిల్లులు అయితే కొండలా పేరుకుపోయాయి. వీటిని చెల్లించడమే ప్రస్తుత ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్‌గా తయారయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం సౌర విద్యుత్ వాడకాన్ని పెంచడం వల్ల ఖజానాపై భారం తగ్గుతుందనేది పాలకుల ఆలోచనగా ఉంది. ప్రభుత్వ ఆధీనంలో నడిచే కార్యాలయాలు, సంస్థల కోసం కేంద్రం ప్రత్యేకంగా రెస్కో నమూనాను తీసుకొచ్చింది. ఈ విధానంలో భాగంగా వాటా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు, నిర్వహణ అంతా ఉచితంగానే కేంద్రమే సమకూరుస్తుంది. కాకపోతే తర్వాత సౌర విద్యుత్ వాడకానికి యూనిట్‌కు రూ.4 చెల్లించడమే రెస్కో విధానంగా ఉంది. ఇలా 25 ఏళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కరెంటు బిల్లుల్లో సైతం రూ.కోట్లలో సొమ్ము ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.

### మధ్యతరగతి, పేదలకే ఎక్కువ లబ్ధి..

సూర్యఘర్ పథకం కింద సోలార్ లబ్ధిదారుల ఎంపికను ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో దృష్టి సారించడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు ప్రతి ఒక్కరికీ ఈ ఫలాలు అందేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా కరెంటు వినియోగానికి గతంతో పోలిస్తే అయ్యే ఖర్చును సౌర విద్యుత్ రూపంలో తక్కువగా అయ్యేటట్లు చూడడంతో పాటు మిగులు విద్యుత్‌ను ఉత్పత్తి చేసే విధంగా గ్రామాలను తయారు చేసే విధంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళుతోంది. దశల వారీగా సోలార్ కాంతులను పంచే ఇళ్లను పెంచడంతో పాటు మరింత మందికి ఈ పథకం గురించి అవగాహన కల్పించి మధ్యతరగతి, పేద వర్గాలకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది

# చికెన్ @ 100




● చికెన్ కొనుగోళ్లపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
● గణనీయంగా పడిపోయిన అమ్మకాలు
● ధరలు తగ్గించిన కొందరు వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ వ్యాపారానికి గడ్డుకాలం ఏర్పడింది. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు జంకుతుండటంతో కొనుగోళ్ళు గణనీయంగా పడిపోయాయి. మరో వైపు చికెన్ ధర కూడా రూ.100లకు దిగజారిపోయింది. చికెన్ కిలో రూ. స్కిన్‌రూ.90, స్కిన్ లెస్ రూ.100 లకు విక్రయిస్తున్నారు. గుంటూరులోని జీటీ రోడ్డు, నగరంపాలెం, నల్లచెరువు వంటి కొన్ని ప్రాంతాల్లో ధరలు తగ్గిస్తూ కిలో రూ. 100 అంటూ కొందరు వ్యాపారులు స్టాల్స్‌లో బోర్డులు ఏర్పాటు చేశారు. గత నెలలో చికెన్ కిలో గరిష్ఠంగా రూ. 270 వరకు విక్రయించారు. ఆ తరువాత కిలో రూ. 250లకు అమ్మకాలు జరిపారు. ఈనెల ప్రారంభంలోనే తెలంగాణలో బర్డ్ ఫ్లూ ప్రచారం పెద్దఎత్తున జరగటం, అక్కడ ప్రభుత్వం అధికారికంగానే చికెన్ విక్రయాలను కొన్ని జిలాల్లో నిషేధించిన విషయం తెలిసిందే. ఈ ప్రచారంతో ప్రజల్లో కొంత భయాందోళన నెలకొన్నది. అయితే జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ప్రజల్లో ఆందోళన తగ్గటం లేదు. రెండు వారాలుగా చికెన్ కొనుగోళ్ళపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా జిల్లా కేంద్రం గుంటూరు నగరంలో స్టాల్స్‌లో చికెన్ విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఇక ఆదివారం వచ్చిందంటే సాధారణ రోజుల కంటే రెట్టింపు విక్రయాలు జరుగుతాయి. ఒక్క ఆదివారం రోజునే చికెన్ స్టాల్స్‌లో రెండున్నర లక్షల కోళ్ళు అమ్ముడుపోతుంటాయని వ్యాపారులు తెలిపారు. అయితే బర్డ్ ఫ్లూ ప్రభావంతో విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. తాజాగా మొన్నటి ఆదివారం నగరంలో కేవలం సాదాసీదాగా 70వేల లోపు మాత్రమే కోళ్ళ విక్రయాలు జరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొనుగోళ్ళు పడిపోవటంతో కొందరు చికెన్ స్టాల్స్ వ్యాపారులు ధరలు తగ్గించేందుకు నిర్ణయించారు.



గుంటూరు : కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ స్టాల్

చికెన్‌స్కిన్‌లెస్ కిలో రూ.100లకు విక్రయించాలని మూకుమ్మడిగా నిర్ణయించుకు న్నారు. దాంతో ఆయా స్టాల్స్‌లో ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం కిలో రూ. 160లకు విక్రయాలు జరుపుతున్నారు.

### కోలుకోలేని దెబ్బే.....

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ స్టాల్స్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. దాంతో చికెన్ స్టాల్స్ కొనుగోళ్ళు వెలవెలబోతున్నాయి. రెండు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నదని, కనీసం స్టాల్స్ నిర్వహణ, కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితులు లేవని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఇది పౌల్ట్రీ వ్యాపారానికి కోలుకోలేని దెబ్బగా చెబుతున్నారు. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు.

పీఎంశ్రీ పథకంతో

# తీరనున్న ల్యాబ్‌ల కొరత

**201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు**

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం ల్యాబ్‌ల కొరత తీరుస్తుంది. ఈ పథకం కింద రాష్ట్రంలో 201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి రూ.15.58 లక్షలు కేటాయించారు. తొలి విడతలో రూ.22.50 కోట్లు మంజూరు చేయగా ల్యాబ్‌ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. చివరి దశ పనులకు మరో రూ.4.54 కోట్లు నిధులు మంజూరు చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయుల పీపీఏ ఖాతాలకు నిధులు విడుదల చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో తుళ్లూరు, రేవేంద్రపాడు, కొల్లిపర, అంగలకుదురు, ప్రత్తిపాడు, బాపట్ల జిల్లాలో ఉల్లిపాలెం, నాగులపాలెం, యాజలి, అమృతలూరు, కొప్పెర ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్‌లు నిర్మిస్తున్నారు. ల్యాబ్‌ల కొరత ఉండి స్థలంతో పాటు అధిక విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలను తొలి దశలో ఎంపిక చేసి ల్యాబ్‌లు మంజూరు చేశారు. ఈ పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చడంతో ఇంటర్ తరగతులు కూడా గత విద్యా సంవత్సరం నుంచి జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయోగాలు ప్రత్యక్షంగా చేసే పరిజ్ఞానం చేకూరనుంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో ఈ ల్యాబ్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు సమగ్ర శిక్షా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న కెమిస్ట్రీ ల్యాబ్

# గురజాలలో.. వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికలు జరగనీయకుండా వైసీపీకి చెందిన వారే ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో 33 మంది సభ్యులు వైసీపీ కౌన్సిలర్లు కావడంతో పురపాలక సంఘం వైసీపీ ఖాతాలో జమ అయింది. మరో ఏడాదిలో ఎన్నికలు వుండగా ఇప్పుడు 17 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

### మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా భారతి ఏకగ్రీవ ఎన్నిక

పిడుగురాళ్ల పురపాలక సంఘం 30వ వార్డు కౌన్సిలర్‌గా వున్నం భారతి వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి మురళీకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతి పేరును 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో వున్నం భారతిని వైస్‌చైర్మన్‌గా ధృవీకరిస్తూ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ నియామకపత్రాన్ని భారతికి అందజేశారు. అనంతరం 17 మంది కౌన్సిలర్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు.

### అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం : చైర్మన్ చినసుబ్బారావు

గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని తామంతా టీడీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని ఛైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, మరికొందరు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే తారక మంత్రంగా తాను పనిచేస్తున్నానని, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వున్నం భారతిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో అనేక విధ్వంసాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధి జోలికి వెళ్లలేదన్నారు. పురపాలక సంఘ భవనానికి తమ హయాంలోనే 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించానన్నారు. రాబోయే ఐదేళ్లకు ఏమేమి అభివృద్ధి సాధించాలో ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. టిడ్కో గృహాలు, రహదారుల విస్తరణ, మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం తెలుగుదేశం పార్టీ ఘనత అన్నారు.



వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరైన కౌన్సిలర్లు

# తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం

◆ కోటప్పకొండలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి ◆ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన



కోటప్పకొండలో తిరుణాళ్ళ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరుణాళ్ళ ఏర్పాట్లను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రానున్న సందర్భంగా తిరుణాళ్ళ ఏర్పాట్లను సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. కోటప్పకొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రబలు వచ్చే రహదారి, భక్తులు కొండకు చేరుకునే రహదారుల నిర్మాణం, మరమ్మతులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొండపై భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న తాటాకు చలువ పందిళ్ళు, క్యూలైన్లు, ఘాట్‌రోడ్డులో కాళింది విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, కడియం కోటి సుబ్బారావు, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో శరవేగంగా ఇగ్నో వర్సిటీ నిర్మాణ పనులు

❖ నాక్‌లో ఏ ప్లస్ ప్లస్ హైయస్ట్ గ్రేడ్ కలిగిన విశ్వవిద్యాలయం
❖ జీ ప్లస్ 7తో పౌండేషన్ - ప్రస్తుతం జీ ప్లస్ 2తో నిర్మాణం

తుళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) స్టడీ సెంటర్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 అంతస్థుల నిర్మాణానికి వీలుగా పౌండేషన్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పనులు మొదటి శ్లాబ్ దశకు చేరుకున్నాయి. జీ ప్లస్ 2 అంతస్థులతో ఇప్పుడు నిర్మాణం చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన అంతస్థుల నిర్మాణం ఉంటుందని అధికారులు చెపుతున్నారు. తుళ్లూరు రెవెన్యూలో ఎన్ 13, 14 ప్రధాన రోడ్ల మధ్యలో దీని నిర్మాణం చేపట్టారు.

### ఇగ్నో ప్రత్యేకతలు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్శిటీకి స్టడీ సెంటర్‌లున్నాయి. ఇందులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని డిగ్రీ పట్టాలు సాధించిన వారికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంటుంది. ఇది గమనించే గత టీడీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించి స్థలాన్ని కేటాయించారు. ఇగ్నో సెంట్రల్ యూనివర్శిటీగా ఉంది. యూజీసీ అనుమతులున్న ఎడ్యుకేషన్ సంస్థ. ఇందులో చదివితే ఉద్యోగ ఉపాధి అవకాశాల తోపాటు, ఉన్నత చదువులకు ఎలిజిబులిటీ ఉంటుంది. అన్నీ రాష్ట్రాల్లో ఇగ్నోస్టడీ సెంటర్‌లున్నాయి. సుమారుగా 67 రీజినల్ సెంటర్‌లు, రెండు వేలు లెర్నింగ్, సపోర్టింగ్ సెంటర్‌లు దేశవ్యాప్తంగా ఇగ్నోకి ఉన్నాయి. నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్ (నాక్)లో హైయస్ట్ గ్రేడ్ (ఏ ప్లస్ ప్లస్ )కలిగి ఉన్న ప్రథమ సార్వత్రిక విశ్వదాలయంగా ఇగ్నో ఉంది. అటువంటి విశ్వవిద్యాలయంలో చదువుకోవటానికి ఏపీ రాజధాని అమరావతిలో అవకాశం ఏర్పడబోతుంది.



రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రెవెన్యూలో నిర్మాణం జరుగుతున్న ఇగ్నో భవనం



జాతీయ రహదారిపై ముప్పవరం ఫ్లైవోవర్ పక్కనున్న అప్రోచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న సాగర్ జలాలు

## రోడ్డెక్కిన సాగర్ జలాలు

**వాహన చోదకుల అవస్థలు**

పంగులూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : సాగర్ జలాలు 16వ నెంబరు జాతీయ రహదారిపై ముప్పవరం ఫైవోవర్ పక్కన అప్రోచ్ రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. ముప్పవరం నుంచి భైటమంజులూరు వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సాగర్ జలాలు ముప్పవరం అప్రోచ్ రోడ్డుపై ప్రవహించాయి. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు దాటి దిగువకు ఉన్న సాగర్ మైనర్ కాలువలో ప్రవహించే నీటిని రైతులు తమ పంట పొలాలు తడుపుకునేందుకు వినియోగిస్తున్నారు. ఈ కాలువ నీరు దిగువకు పోకుండా పొలాలు తడుపుకునే రైతులు అడ్డుకట్ట వేయడమో లేక కాలువలోకి సాగర్ జలాలు మిక్కటంగా ప్రవహించిన కారణమో సాగర్ జలాలు సోమవారం రోడ్డెక్కి ప్రవహించాయి. దీంతో ఈ రహదారిలో రాక పోకలు సాగించిన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## భూ వ్యత్యాసాల సవరణకు సహకరించాలి



బూదవాడలో భూముల ఆన్‌లైన్ వ్యత్యాసాలపై పరిశీలన చేస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో చోటు చేసుకున్న భూ వ్యత్యాసాల సవరణకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పీ సింగారావు కోరారు. సోమవారం మండలంలోని బూదవాడ గ్రామంలో రైతు ఈమని వీరారెడ్డికి చెందిన సర్వే నెంబరు 132లో 0.86 సెంట్ల విస్తీర్ణం ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉండగా 0.45 సెంట్ల విస్తీర్ణం నమోదు చేశారు. ఈ విషయమై సవరణ కోసం వీరారెడ్డి దాఖలు చేసిన అర్జీని పరిశీలించిన తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో ఆధీనంలో ఉన్న భూమిని రికార్డులతో సరిపోల్చారు. సమీప రైతులతో చర్చించి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. భూ వివాదాల విషయంలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని, రైతులు తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

## 23న ప్రతిభామూర్తుల కార్యక్రమం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు ప్రతిభా మూర్తులు - మధురస్మృతులు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పీసీహెచ్ కోటయ్య సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## రేపు విద్యుత్ అదాలత్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక, అపరిష్కృత విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10-30 గంటలకు స్థానిక శింగరకొండ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ అదాలత్ జరుగుతుందని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. విద్యుత్ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరవుతారని తెలిపారు. అద్దంకి సబ్ డివిజన్ పరిధిలోని అద్దంకి టౌన్, అద్దంకి రూరల్, కొరిశపాడు, జె.పంగులూరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలకు తక్షణ పరిష్కారం పొందవచ్చని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు.

## దివ్యాంగుల హక్కులపై అవగాహన ఉండాలి



దివ్యాంగ విద్యార్థులతో న్యాయవాది రామకృష్ణారెడ్డి

చినగంజాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి, సమాజంలో ఉన్నతంగా బతకాలని చీరాల న్యాయవాది ఆసోది రామకృష్ణారెడ్డి, ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావులు అన్నారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని దివ్యాంగ విద్యార్థినులు వారి హక్కుల పట్ల సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని 6వ తరగతి బాలికలకు బాలల హక్కులు, బాల వివాహాలు వలన కలిగే నష్టాలు, వరకట్నం, నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వారు అవగాహన కల్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల్లో దివ్యాంగుల జీవన శైలిపై కమిటీతో సర్వే చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చేసిన సర్వేని హైకోర్టుకు పంపనున్నట్లు తెలిపారు. కేజీబీవీలో పలువురు దివ్యాంగ విద్యార్థినులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, పారా లీగల్ మండల వలంటీర్ ఎం.వీ.రామారావు, టీడీపీ నాయకులు పర్వతరెడ్డి పార్థసారిథి పాల్గొన్నారు.

## పోలీసులు వేధిస్తున్నారంటూ తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఇమాం వలి, అతని తల్లి గాలీబీ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఇమాం వలికి సల్మాతో కొన్నేళ్ల కిందట వివాహం కాగా, స్పర్థలతో రెండేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పెద్ద మనుషుల ద్వారా ప్రయత్నించినా భార్య కాపురానికి రాలేదని, న్యాయపరంగా విడాకులు కోరిన తనతోపాటు తన తల్లి, మరికొందరిపై రేణంగివరం పోలీస్ స్టేషన్‌లో సల్మా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వినోద్‌బాబు తమను తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఇబ్బంది ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ ఇమాం వలి సోమవారం పురుగుమందు తాగే ప్రయత్నం చేయగా, కొడుకు చేతిలో డబ్బాను లాక్కొని తల్లి గాలీబీ పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ వినోద్‌బాబు మాట్లాడుతూ భార్య సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నోటీసు ఇచ్చేందుకు స్టేషన్‌కు పిలిపించినట్లు చెప్పారు. తాను ఎలాంటి ఇబ్బందికీ గురిచేయలేదని తెలిపారు.

# తరచూ రైలు ప్రమాదాలు

- బండి నుంచి జారిపడి కొందరు పట్టాలు దాటుతూ మరికొందరు
- ఈనెలలో ఇప్పటికే ఎనిమిది మరణాలు




చీరాల రైల్వేస్టేషన్

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్ పరిధిలో రైలు ప్రమాదాలు రోజు రోజూ పెరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా రైళ్లలో ప్రయాణాలు చేస్తూ కొందరు, చూడకుండా పట్టాలు దాటుతూ మరి కొందరు మృత్యువాత పడుతున్నారు. ఈక్రమంలో కదిలే రైళ్ల నుంచి జారిపడి మృతి చెందిన వారి ఆధారాలు సేకరించేందుకు రైల్వే అధికారులకు నానా యాతన పడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది బీహార్, రాజస్థాన్ ఇతర దూరప్రాంతాలకు చెందిన వారై ఉంటున్నారు. లోకల్‌గా పట్టాలు దాటుతూ మృతి చెందిన వారి ఆధారాలు కూడా సుమారు 3 నుంచి 5 రోజులు పడుతుంది. దాదాపు ప్రతినెలలో కనీసం 5 నుంచి 8 వరకు పట్టాలపై మృతి చెందుతున్నారు. అయితే ఈనెలలో ఇప్పటికే సుమారు 8మంది మరణించారు. ఇటీవల ఓ లెక్చరర్ పట్టాలు దాటుతూ మరణించగా, మరుసటి రోజు ఇద్దరు, సోమవారం ఉదయం ఒకరు మృతి చెందారు. ఈక్రమంలో ఆధారాలు లేని మూడు మృతదేహాలను ఇప్పటికే రైల్వే పోలీసులు చీరాల ఏరియా హాస్పిటల్‌కు తరలించి వారి బంధువులెవరో తెలుసుకునే పనిలో పడ్డారు.

**ప్రమాదాల నివారణకు చర్యలు**

ప్రయాణికులు ప్రమాదాలబారిన పడకుండా ఉండాంటే అసలు ముందు వారిలో చైతన్యం రావాలని విశ్లేషకులు చెప్తున్నారు. కొందరు బాధ్యతలు మరిచి నిర్లక్ష్యంగా రైళ్లల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. రైళ్లలో మెట్ల వద్ద కూర్చుని అజాగ్రత్తగా ఉంటూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా లోకల్‌గా ఉన్న ప్రజలు పట్టాలు దాటే క్రమంలో నిబంధనలేవీ పట్టించుకోవడం లేదు. చూడకుండా సిగ్నల్స్ గమనించకుండా పట్టాలు దాటుతూ ప్రమాదాలబారినపడుతున్నారు. పట్టాలు దాటే క్రమంలో ప్రజల్లో అవగాహన రావాలి. అలాగే రైళ్లలో ప్రయాణిస్తున్న వారు మెట్ల వద్ద కూర్చోనివ్వకుండా చర్యలు చేపట్టాలి. లేకుంటే ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.



సోమవారం మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

# రోడ్డు ప్రమాదంలో నూజివీడువాసి మృతి

- మరో ఇద్దరికి స్వల్పగాయాలు
- బెంగళూరు నుంచి వస్తుండగా మార్టూరు వద్ద ఘటన





ప్రమాదానికి గురైన కారు
కృష్ణ (ఫైల్)

మార్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు మండల పరిధిలో జాతీయరహదారిపై సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురైన కారు ఏలూరు జిల్లా నూజివీడుకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన జూలూరి కృష్ణ (35), కాగా స్వల్పగాయాలతో బయటపడిన అతని తమ్ముడు జూలూరి వంశీకృష్ణ, బంధువు కొప్పురావూరి వివేకానంద మహర్షిగా పోలీసులు తెలిపారు. కృష్ణకు భార్య ఇద్దరు ఆడపిల్లలు, అబ్బాయి ఉన్నారు. ముందువెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారు మధ్య సీటులో నిద్రిస్తున్న కృష్ణకు బలమైన గాయాలు కావడంతో అతను మృతి చెందారు. కారును నడుపుతున్న కృష్ణ తమ్ముడు వంశీకృష్ణ, మరో వ్యక్తి కే వివేకానంద మహర్షి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వారు మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఇదిలావుండగా కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వారిద్దరూ ప్రాణాలతో బయటపడ్డారని పోలీసులు తెలిపారు. కారు ఢీకొన్న ముందున్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఉదయం సమయంలో మంచుగా ఉండటం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండడం తదితర కారణాలతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

**నూజివీడు నుంచి బెంగళూరు వెళ్లి వస్తుండగా ప్రమాదం**

నూజివీడులో సూసర్లవారివీధిలో వైశ్యఫార్మా మెడికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్న జూలూరి కృష్ణ, తమ్ముడు వంశీకృష్ణ, విజయవాడలో ఉంటున్న బంధువు వివేకానంద మహేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి కారులో బెంగళూరులో ఉంటున్న చెల్లెలు వద్దకు వెళ్లారు. తన దగ్గర ఉన్న చెల్లెలు కారును ఆమెకు ఇచ్చి ఆమె దగ్గర ఉన్న తమ కారును తీసుకొని తిరిగి ఆదివారం రాత్రి వారు నూజివీడుకు కారులో బయలు దేరారు. మార్టూరు వద్ద వారి కారు ప్రమాదానికి గురైంది. మృతి చెందిన కృష్ణ తండ్రి సీతారామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా అనంతరం కృష్ణ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టమ్ చేశారు. తరువాత బంధువులకు అప్పగించారు. ఎస్ఐ సైదా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హైవేపై ఆగిన అఘోరీ కారు

**ఆమెను చూసేందుకు గుమిగూడిన ప్రజలు**



జేవీపాలెం వద్ద హైవేపై విశ్రాంతి కోసం ఆగిన మహిళా అఘోరీ

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా తెలుగు రాష్ట్రాలలోని పలు నగరాలు, పట్టణాల్లో సంచరిస్తూ హడావుడి సృష్టిస్తున్న మహిళా అఘోరీ సోమవారం జేవీపాలెం సమీపంలో జాతీయ రహదారి పక్కన కారులో కనిపించారు. కారు ముందు భాగంలో అఘోరి, నాగసాధు, సనాతన ధర్మ అని ఇంగ్లీషులో రాసి, తోరణం, మధ్యలో త్రిశూలం, శివలింగం, పుర్రె బొమ్మలతో పెయింటిగ్ వేసి జెండా కట్టి ఉన్న కారును చూసిన ప్రజలు కారువద్దకు చేరుకున్నారు. అఘోరీ కారు ఆగిన విషయాన్ని హైవే పెట్రోలింగ్ సిబ్బంది ద్వారా తెలుసుకున్న రేణంగివరం పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కారులో ఉన్నది మహిళా అఘోరి అని గుర్తించిన పోలీసులు ఆమెతో మాట్లేడే ప్రయత్నం చేశారు. తను విశాఖ వైపు నుంచి చెన్నై వెళ్తున్నానని, కొంత సమయం విశ్రాంతి తీసుకుని బయలుదేరి వెళతానని చెప్పడంతో పోలీసులు గుమికూడిన ప్రజలను అక్కడ నుంచి పంపించివేశారు. సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో ఆగిన కారులో ఉన్న అఘోరీ కిందికి దిగుతుందేమో, ఏమైనా హడావుడి చేస్తుందేమోనని సమీపంలో కాపు కాసిన పోలీసులు మూడున్నర సమయంలో అక్కడి నుంచి కారును స్వయంగా నడుపు కుంటూ బయలు దేరడంతో సదరు సమాచారాన్ని పై అధికారులకు చేరవేసిన పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## పొట్టు ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్

- రోడ్డుపై బోల్తా
- ముగ్గురుకి స్వల్ప గాయాలు
- తప్పిన పెను ప్రమాదం
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తొలగిస్తున్న సీఐ



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన పొట్టు ట్రాక్టర్‌ను తొలగింప చేస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరి పొట్టు లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను ఓవర్ టేక్ చేసే క్రమంలో టిప్పర్ ఢీ కొనటంతో ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు సోమవారం సాయంత్రం అద్దంకి పట్టణం కు సమీపంలో కలవకూరు రోడ్డు లో రామకూరు నుండి వరి పొట్టుతో అద్దంకి వస్తున్న ట్రాక్టర్ ను వెనుక నుండి వస్తున్న టిప్పర్ ఓవర్ టేక్ చేస్తూ ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బో ల్తా పడింది. ప్రమాదం జరుగుతున్నట్లు గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ మరో ఇద్దరు యువకులు ట్రాక్టర్ పై నుండి దూకటం తో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రాక్టర్ బొ ల్తా పడ్డ సమీపంలో విద్యుత్ స్థంభం ఉంది. పొరపాటున విద్యుత్ స్థంభం ఢీ కొని ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు అభి ప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే సిఐ సుబ్బరాజు సంఘటనాస్థలానికి చేరుకొని రోడ్డు కు అడ్డంగా ఉన్న పొట్టు ట్రాక్టర్ ను క్రేన్ సహాయంతో తొలగింప జేసి ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చేశారు.



వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన భారతి

## గురజాలలో.. వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో సహ టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికలు జరగనీయకుండా వైసీపీకి చెందిన వారే ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో 33 మంది సభ్యులు వైసీపీ కౌన్సిలర్లు కావడంతో పురపాలక సంఘం వైసీపీ ఖాతాలో జమ అయింది. మరో ఏడాదిలో ఎన్నికలు వుండగా ఇప్పుడు 17 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

**మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా భారతి ఏకగ్రీవ ఎన్నిక**

పిడుగురాళ్ల పురపాలక సంఘం 30వ వార్డు కౌన్సిలర్‌గా వున్నం భారతి వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి మురళీకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతి పేరును 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో వున్నం భారతిని వైస్‌చైర్మన్‌గా ధృవీకరిస్తూ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ నియామకపత్రాన్ని భారతికి అందజేశారు. అనంతరం 17 మంది కౌన్సిలర్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు.

**అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం**

**- ఛైర్మన్ చినసుబ్బారావు**

గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని తామంతా టీడీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని ఛైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, మరికొందరు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే తారక మంత్రంగా తాను పనిచేస్తున్నానని, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వున్నం భారతిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో అనేక విధ్వంసాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధి జోలికి వెళ్లలేదన్నారు. పురపాలక సంఘ భవనానికి తమ హయాంలోనే 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించానన్నారు. రాబోయే ఐదేళ్లకు ఏమేమి అభివృద్ధి సాధించాలో ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. టిడ్కో గృహాలు, రహదారుల విస్తరణ, మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం తెలుగుదేశం పార్టీ ఘనత అన్నారు.

# ఇదిగో బెంగళూరు హైవే

- అవిగో టిడ్కో ఇళ్లు
- ఇక మీకు కావాలన్నా స్థలాలు దొరకవు
- ఇదీ అద్దంకిలో రియల్ వ్యాపారులు, బ్రోకర్‌ల మాయాజాలం
- కొనుగోలుకు ముందుకు రాని ప్రజలు



అద్దంకి పట్టణ సమీపంలో నాగులపాడు రోడ్డులో వేస్తున్న వెంచర్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పుంజుకునేలా చేసేందుకు వ్యాపారులు, దళారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇదిగో విజయవాడ - బెంగళూరు హైవే పనులు జోరుగా సాగుతున్నాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నాయి. భవిష్యత్‌లో స్థలాలు కావాలన్నా దొరకవు... త్వరపడండి అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఊదరగొడుతున్నారు. అయినా కొనుగోలుదారులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపటం లేదు. అద్దంకి సమీంలో గుండా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దీంతో అద్దంకి పట్టణం నుంచి రేణింగవరం రోడ్డు, నాగులపాడు రోడ్డు, మేదరమెట్ల రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులలో వెంచర్‌లు ఇబ్బడిముబ్బడిగా వేస్తున్నారు. ఇక శింగరకొండ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అత్యధిక శాతం నిర్మాణ పనులు జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణం పునఃప్రారంభం అయ్యే అవకాశం ఉండడంతో శింగరకొండ రోడ్డులో కూడా వెంచర్ లు వెలుస్తున్నాయి. ఇలా అద్దంకి చుట్టూ వెంచర్‌లు పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అద్దంకిలో రియల్ ఎస్టేట్ ధరలకు అడ్డూ అదుపూ లేకుండా పెరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని ప్రాంతంపై కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. దీంతో అద్దంకి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు ఒకింత తగ్గాయి. ఈ నేపథ్యంలో మరలా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పుంజుకునే విధంగా చేసేందుకు వ్యాపారులు కష్టపడుతున్నారు. కాని కొనుగోలుదారులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపటం లేదు.





అద్దంకి సమీపంలో నిర్మాణంలో ఉన్న విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు .. శింగరకొండ సమీపంలో టిడ్కో ఇళ్లు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పడవల ఘననారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపాలెం విద్యుత్ కేంద్రం నుంచి పెదగంజాం విద్యుత్ కేంద్రానికి వెళ్లే లైన్‌లో విద్యుత్ వైర్లు, నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చినగంజాం, పల్లెపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిల్లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌లతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

## వేటపాలెంలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్‌లను ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన విశ్వసనీయసమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించి పందిళ్లపల్లి జంక్షన్‌లో మూడు ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# వేధిస్తున్న పోలీస్ సిబ్బంది కొరత

- న్యాయ పరిష్కారాల్లో తీవ్ర జాప్యం
- ఫిర్యాదుదారులకు ఇబ్బందులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్‌లకు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో స్టేషన్‌లను ఆశ్రయించిన ఫిర్యాదుదారులు న్యాయ పరిష్కారంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. చీరాల ఒకటవ పట్టణానికి రైల్వే స్టేషన్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, ముంతావారి సెంటర్ నిత్యం ప్రజలు, వాహనదారులతో రహదారులు రద్దీగా ఉంటాయి. ఈక్రమంలో కొంత ట్రాఫిక్ సమస్యలు ఉంటాయి. అలాగే వాహనాలు చోరీతో పాటు, రోడ్డు ప్రమాదాల వివాదాలు అధికమే. అలాగే చీరాల చుట్టుపక్కల ఎక్కడ సమస్య జరిగినా ఆ కుటుంబ సభ్యులు, మద్దతుదారులు, లేదా పార్టీలు, వ్యక్తులు గడియార స్తంభం కూడలి వద్ద ధర్నా కార్యక్రమాలు చేస్తుంటారు. అంతేకాకుండా స్టేషన్ పరిధి ఒక వైపు జాండ్రపేట వరకు మరోవైపు చీరాల ఏరియా హాస్పిటల్ సమీపంలోని కుందేరు వరకు ఉండగా, గేటు అవతలి నుంచి వైకుంఠపురం, విఠల్‌నగర్, హరి ప్రసాద్‌నగర్ వంటి జోన్‌లు కూడా ఉన్నాయి. దీంతో తలెత్తిన సమస్యలు అధికంగా ఉండగా, గస్తీ నిర్వహించేందుకు విస్తీర్ణం కూడా ఎక్కువగానే ఉంది. స్టేషన్‌లో ప్రస్తుతం ఒక ఎస్‌హెచ్‌వో, ఒకరు ట్రాఫిక్ ఆర్‌ఎస్సై, ఇద్దరు స్టేషన్‌కు పరిమితం కాగా, మరొకరు రికవరీలకు సుప్రసిద్ధులుగా పేరు గాంచడంతో అవసరాలకు అనుగుణంగా అన్ని స్టేషన్‌లకూ వినియోగిస్తున్నారు. సుమారు 50 మంది మాత్రమే ఉండగా వీరిలో సెలవుల్లో ఉన్నవారు, రికార్డు వర్క్‌లు, దర్యాప్తు, ట్రాఫిక్ వగైరాతో పోల్చుకుంటే నానా యాతన అవుతుంది.



చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

రెండవ పట్టణ పరిధిలో ఒక ఎస్‌హెచ్‌వో, ఇద్దరు ఎస్సైలు ఉండగా సుమారు 50 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ పేరాల, జయంతిపేట, జాన్‌పేట, ఐక్యనగర్, కొత్తపేట రోశయ్యనగర్, ఐఎల్‌టీడీ కాలనీతో పాటు శ్రుంగారపేట, రామనగర్, ఆదినారాయణపురం వంటి ప్రాంతాలు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కొన్నిప్రాంతాల్లో సారా, కొట్లాట కేసులతోనే పోలీసులు తల మునకలవుతుంటారు. ఈక్రమంలో చాలీచాలని సిబ్బందితో పోలీసులు రోజులు గడుపుతున్నారు. చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, వేటపాలెం స్టేషన్‌లు పేరు చిన్నవే అయినా లా అండ్ ఆర్డర్ సమస్యలు అధికం. నిత్యం సివిల్, క్రిమినల్ కేసులు పేట్రేగుతుంటాయి. అక్రమ ఇసుక రవాణా, జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమే. అంతేకాకుండా ఈరెండు స్టేషన్‌లకు ప్రొటోకాల్ డ్యూటీలు కోకొల్లలు. ఈనేపథ్యంలో స్టేషన్‌లను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరిష్కారం కోసం స్టేషన్‌ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాధితులు కోరుతున్నారు.



కూలీలకు సూచనలిస్తున్న ఏపీవో సంతోషం

## కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300 కూలి

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులకు వచ్చేవారు పని ప్రదేశంలో నాలుగు గంటలపాటు ఉండాలని, కొలతల ప్రకారం పనిచేయాలని ఏపీవో సంతోషం అన్నారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, ఆరికట్లవారిపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఏపీవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు కేటాయించిన కొలతల ప్రకారం పని చేస్తే రూ.300 వస్తుందన్నారు. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కూలీలకు పనిపట్ల అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ కావ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

బల్లికురవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళ, బుధ, గురువారం వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయని సీడీపీవో సుధ తెలిపారు. బల్లికురవ, కొప్పెరపాడు ఉన్నత పాఠశాలల్లో ఈ శిక్షణ జరుగుతుందని సీడీపీవో తెలిపారు.

సంతమాగులూరు : అంగన్వాడీ కార్యకర్తలకు నేటి నుంచి 20వ తేదీ వరకు సంతమాగులూరులోని జడ్పీ హైస్కూల్, ఏల్చూరు హైస్కూల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో సుధ తెలిపారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు

బల్లికురవ. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఎస్‌ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. సోమవారం బల్లికురవ బస్‌స్టేషన్ ఆవరణలో మద్యం సేవిస్తున్న వారికి ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. పాఠశాల, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామాల్లో హోటళ్లను ఎస్‌ఐ తనిఖీ చేశారు.

## వాలిన కరెంట్ పోల్

**పొంచి ఉన్న ప్రమాదంపై ఆందోళన**



ముక్తేశ్వరంలో పడి పోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ పోల్

బల్లికురవ. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. చెన్నుపల్లి నుంచి ముక్తేశ్వరం గ్రామానికి వచ్చే ప్రధాన మలుపు వద్ద ఉన్న కరెంట్ పోల్ వాలి ఉంది. దీంతో ఈస్తంభం కూలితే పక్కనున్న గృహాలపై పడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని వెంటనే సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేటు వైద్యుడు మృతి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో గత 30 ఏళ్ల నుంచి ఆర్‌ఎంపీగా వైద్య సేవలందిస్తున్న ద్రోణాదుల కోటేశ్వరరావు (58) అనారోగ్య కారణంగా మృతి చెందారు అతనికి భార్య కుమారుడు ఉన్నారు. అనారోగ్యంతో గుంటూరులోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. సోమవారం పలువురు చుట్టుపక్కల గ్రామీణ వైద్యులు అతని మృతదేహానికి నివాళులర్పించారు.

## కాల్వల్లో పూడికతీత

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో సోమవారం పంచాయతీ అధికారులు సైడు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. వారం రోజులుగా గ్రామంలో పేరుకున్న చెత్తకుప్పలను, కాలువల్లోని మురుగును తొలగించారు. పారిశుధ్య పనులను ఈవోఆర్డీ కృష్ణ పరిశీలించగా, కార్యదర్శి రాణి, నాయకులు వీరభద్రయ్య, చంద్రయ్య పర్యవేక్షించారు.

## అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎం.వసంతరావు, రేఖా ఎలిజబెత్, ప్రమీల, బ్యూలా, సుజీవన, పద్మ, శిరీష, జ్యోతి, భూలక్ష్మి, అనిత, నిర్మల పాల్గొన్నారు.

ఇంకొల్లు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సోమవారం ధర్నా చేపట్టారు.

## 2 లీటర్ల సారా స్వాధీనం

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సారా నియంత్రణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించి ఆదినారాయణపురంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

## ఆదర్శనీయుడు మురళీసుధాకర్

అద్దంకి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ చుండూరి మురళీసుధాకరరావు ఆదర్శంగా నిలుస్తున్నారని సాహితీ కౌముది అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గోశాల నిర్వహణకు ప్రోత్సాహం, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సాహిత్యానికి ప్రోత్సాహం అందిస్తున్న చుండూరి మురళీసుధాకరరావు, ప్రసన్న దంపతులను సోమవారం పుట్టంరాజు కళాక్షేత్రంలో పలు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అద్దంకి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, 16 సంవత్సరాలుగా రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ 441 రక్తదానాలు చేయించారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వారణాసి రఘురామశర్మ, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, పోలిరెడ్డి, గాడేపల్లి దివాకర్‌దత్, డీవీఎం సత్యనారాయణ, కొండకావూరి కుమార్, కూరపాటి రామకోటేశ్వరరావు, రాజశేఖర్, కడియం పాపారావు, పీసీహెచ్ కోటయ్య, ఆర్‌వీ రాఘవరావు, చాగంటి శేషారెడ్డి, మలాది శ్రీనివాసరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, న్యాయవాది రమేష్ పాల్గొన్నారు.



మురళీసుధాకరరావు, ప్రసన్న దంపతులను సన్మానిస్తున్న సాహితీ కౌముది సంస్థ ప్రతినిధులు



జలవనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ మోహనరావు

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా చేపట్టిన ఉత్పత్తులను వినియోగిస్తే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు.సోమవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం జలవనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో రైతులు సాగుకు అవసరమైన అన్నిరకాల కాషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచామన్నారు. అదేవిధంగా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏవో మేరీ మరియమ్మ, ఏడీపీఎం మోహన్, ఎంటీ వెంకటేశ్వర్లు, కోటిబాబు పాల్గొన్నారు.

## స్వయం సంఘాల వివరాలను నమోదు చేయాలి



యాప్ వినియోగంపై వీవోఏలకు సూచనలిస్తున్న ఏపీఎం

పంగులూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్వయం సహాయక సంఘాల పూర్తి వివరాలను వీవోఏలు ఎన్‌ఆర్‌ఎల్‌ఎం పోర్టల్‌లో నమోదు చేయాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్ సూచించారు. వెలుగు కార్యాలయంలో సోమవారం లోకోస్ యాప్ వినియోగంపై వీవోఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు రుణాల పంపిణీ, రికవరీపై స్త్రీనిధి మేనేజర్ టి.శ్రీనివాసరావు సమీక్ష చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీసీ సురేష్, పూర్ణ, ఎకౌంటెంట్ భాస్కరమ్మ, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : డ్వాక్రా గ్రూపు సభ్యుల పూర్తి వివరాలను యాప్‌లో తప్పనిసరిగా పొందుపరచాలని ఏపీఎం అనూరాధ సూచించారు. వెలుగు కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘం లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, సీసీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## పోలీసు వృత్తి కత్తిమీద సామువంటిది



సీఐ శేషగిరిరావుకు జ్ఞాపికను అందిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో పోలీసు వృత్తి కత్తిమీద సాములా ఉందని, ఎందరినో మెప్పించి సాహసోపేతంగా గమ్యాలు చేరుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల ఎస్పీ తుషార్‌డూడీ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న రూరల్ సీఐ శేషగిరిరావును పలువురు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. జ్ఞాపికను అందించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్య వేదిక అధ్యక్షుడు జ్యోతిరమేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, యోహాను, విజయ్‌కుమార్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

## గంజాయి పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా

**వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు**

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుల్లోని పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి స్టేషన్ పరిధిలోని ఉజిలీపేట ప్రాంతంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో సీఐ మాట్లాడుతూ దాదాపు గంజాయికి అడ్డుకట్ట వేసినట్లు చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పాత నేరస్థులపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయాలు, రవాణా జరిపితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

# విద్యార్థుల భవితవ్యంపై దృష్టి సారించాలి

**ఎమ్మెల్యే కొండయ్య**

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల భవితవ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని అక్కయ్యపాలెం ఎంపీయూపీ స్కూల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా స్కూల్‌ను మోడల్‌గా మార్చేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నివేదికను సిద్ధం చేయించాలని సూచించారు. అనంతరం కొండయ్య విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే చల్లారెడ్డి పాలెంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సందర్భగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వాడరేవు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అంతేకాకుండా వాడరేవుకు చెందిన మత్స్యకారుడు ఎరిపిల్లి రమణ(53) వేటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీంతో ఆకుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు. అంతకముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.13లక్షల 20వేల సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



విద్యార్థినికి నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

## జీతాలు చెల్లించండి మహాప్రభో

**11 పాఠశాలల్లో పనిచేస్తున్న**

**ఆయాలకు ఏడు నెలలుగా అందని వైనం**

బల్లికురవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలను ప్రతి రోజు పరిశుభ్రం చేస్తున్న 11 పాఠశాలల ఆయాలకు ఏడు మాసాలుగా జీతాలు చెల్లింపులు చేయలేదు. దీంతో ఆయాలు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వైదన, కొత్తపాలెం, అంబడిపూడి, ఉప్పుమాగులూరు, జమ్మలమడక, వల్లాపల్లి, కోటవారిపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 11 పాఠశాలలకు జూలైలో నూతనంగా ఆయాలను నియమించారు. వారికి అప్పటి నుంచి జీతాలు మాత్రం చెల్లింపులు చేయడం లేదు. తమకు ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని వారు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించగా వారు మేము జిల్లా కార్యాలయానికి జీతాల ఫైల్ పంపామని అక్కడ అధికారులు సరిగ్గా స్పందించడం లేదని సమాదానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచీ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు, ప్రాంగణం పరిశుభ్రం చేసే తమకు జీతాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆయాలు వాపోతున్నారు. నెలకి రూ. 6వేల వంతున జీతం రావాల్సి ఉందని వారు తెలిపారు. తమ తోటి పనిచేసే ఇతర పాఠశాలల ఆయాలకు నెలనెలా జీతాలు వస్తున్నాయని తమకు మాత్రమే జీతాలు ఎందుకు చెల్లించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు జీతాల చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని 11 పాఠశాలలకు చెందిన ఆయాలు కోరుతున్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ప్రతినిధులు

## పోటీలతో బహుళ ప్రయోజనాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోటీల్లో పాల్గొనడం వలన శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కాకినాడ జెఎన్‌టీయూ ఆధ్వర్యంలో పవర్ లిఫ్టింగ్ (స్త్రీ, పురుషులు) ఇంటర్ కాలేజీ సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, రెండింటినీ ఒకేలా స్వీకరించి విజయాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, డా.శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి పథకాలను శుభ్రం చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలోని రక్షిత మంచినీటి పథకాలను ఆయా గ్రామాలల పంచాయతీ కార్యదర్శులతో తనిఖీ చేయించారు. ట్యాంకులో పక్షుల కళేబరాలు, శరీరభాగాలు, పక్షుల మలం, ఇతర వ్యర్థాలు ఏమైనా ఉన్నాయని తనిఖీ చేశారు. వెంటనే ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలని ఎంపీడీవో తెలిపారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి నివారణ దృష్ట్యా మరిగే నీటిలో బాగా ఉడికించిన చికెన్‌ను మాత్రమే తినాలని తెలిపారు.

# రొంపేరు కాలువలోకి ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి, పలువురికి స్వల్పంగా గాయాలు
- ధాన్యం తరలించేందుకు వెళ్తుండగా ప్రమాదం

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రొంపేరు వాగులో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా పలువురు కూలీలు గాయపడిన ఘటన సోమవారం కారంచేడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గర్నెపూడి పోతురాజు(42) మరికొంత మంది కూలీలతో కలసి ధాన్యం తరలించేందుకు వెళుతున్న నేపథ్యంలో ఈప్రమాదం జరిగింది. పోలీస్ స్టేషన్ సమీపంలోని రొంపేరు వాగుపై ఉన్న బ్రిడ్జిని ఎక్కించే క్రమంలో ప్రమాదానికి గురై పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. ఈప్రమాదంలో పోతురాజు ట్రాక్టర్‌తో పాటు నీటిలో పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురై ప్రాణాపాయస్థితిలో ఉన్న పోతురాజును కానిస్టేబుల్ యనమల బాల శంకరావు సీపీఆర్ నిర్వహించి 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.



కారంచేడు వద్ద రొంపేరు కాలువలో బోల్తాపడిన ట్రాక్టర్ పోతురాజు మృతదేహం

**తప్పిన పెనుప్రమాదం**

ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో ఐదుగురు కూలీలు ఉన్నారు. బ్రిడ్జిపై నుంచి కాలువలోకి ట్రాక్టర్ పడిపోయింది. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో కూలీలు బయట పడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

కాగా కొనఊపిరితో ఉన్న పోతురాజును కాపాడేందుకు కానిస్టేబుల్ బాలశంకరరావు అన్నివిధాలా ప్రయత్నించారు. నోటిలో నోరుపెట్టి ప్రాణ వాయువు అందించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన కృషిని స్థానికులు అభినందించారు.